క్లుప్తంగా

21 నుంచి తిరునాళ్ల

సదుం: మండలంలోని జంగంపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాళ్ల ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు చెప్పారు. 21న అంకురార్పణ, 22న ధ్వజారోహణం, పూజలు, 23న ఉదయం అభిషేకాలు, రాత్రి చెక్కభజనలు, కోలాటాలు, దేవరెద్దుపూజ, అన్నదానం, 24న ఉదయం కల్యాణోత్సవం, 25న వసంతోత్సవం, పార్వేట ఉత్సవం, పవళింపు సేవతో తిరునాళ్ల పరిసమాప్తమవుతుందని తెలియజేశారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



బైరెడ్డిపల్లెలో ర్యాలీ చేస్తున్న యువకులు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లెలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటంతో బైరెడ్డిపల్లెలో యువకులు గ్రామవీధుల్లో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఆయన చేసిన పోరాటం , సేవలను కీర్తించారు. శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు.

ఉత్తమ ప్రతిభకు అవార్డు



అవార్డు అందుకుంటున్న చరణ్

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎపీవన పరీక్షల్లో పులిచెర్ల హైస్కూల్‌కు చెందిన 7వతరగతి విద్యార్థి పి.చరణ్ జిల్లా స్థాయిలో మూడవ స్థానం లభించింది. శనివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ విద్యార్థికి నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు.హెచ్‌ఎం, పలువురు ఉపాధ్యాయులు చరణ్‌ను అభినందించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఏఓ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

శాంతిపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.రాధాకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామకుప్పం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి రాగా, శాంతిపురం ఈఓపీఆర్డీగా ఉన్న ఈశ్వరన్ రామకుప్పం ఎంపీడీఓగా నియమితులయ్యారు. గతంలో ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండడంతో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హేమమాలిని ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

సదుం హెచ్‌ఎంగా జయకుమార్‌రెడ్డి



సదుం: స్థానిక జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా జయకుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాపానాయుడుపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇదే స్కూల్లో ఎనిమిదేళ్ల గణిత ఉపాధ్యాయునిగా పనిచేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రెస్కో డైరెక్టర్ థామస్

రామకుప్పం: మండలంలోని బల్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఎర్రప్ప సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ స్థానిక రెస్కో డైరెక్టర్ థామస్ ద్వారా మృతుని కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విజయ్, ఎంపీటీసీ సభ్యురాలు పెరిటాయమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21న మండల సమావేశం

పుంగనూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21న బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీకి వితరణ

బరాల: కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పూతలపట్టు మండలం గాండ్లపల్లెకు చెందిన ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, వినాయకమ్మ దంపతుల కుమారుడు లలిత్‌సాగర్ సోమవారం సుమారు రూ.50 వేల విలువ చేసే 5 లీటర్ల ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వైద్యాధికారి స్వాతిసింధూరకు వితరణ చేశారు. దాత సేవలు వెలకట్టలేనివని వైద్యాధికారి కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ శివయ్య, సప్తగిరి బ్యాంక్ మేనేజర్ రమేష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

సామాజిక వర్గాలకు సమ న్యాయం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో సామాజిక వర్గాలకు సమన్యాయం కల్పించింది. అన్ని కుల సంఘాలకు విలువైన భూములు కేటాయించడంతో భవన నిర్మాణాలకు ఆ సంఘాలు శ్రీకారం చుట్టాయి. అర్ధంతరంగా ఆగిన కొన్ని కమ్యూనిటీ భవన నిర్మాణాలను సైతం పూర్తి చేశారు. మున్సిపాలిటీలోని కుల సంఘాలకు కేటాయించిన స్థలాలు కోట్లాది రూపాయల విలువ చేసేవి కావడం గమనించ తగ్గ అంశం.



బలిజ భవనం ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్సీ భరత్ తదితరులు చేస్తున్న భూమి పూజ (ఫైల్)

- వైఎస్సార్ సీపీ హయాంలో కుల సంఘాలకు ప్రాధాన్యత
- విలువైన స్థలాలు కేటాయింపు
- అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు సైతం పూర్తి

కుప్పం: నియోజకవర్గంలో 42 శాతం ఉన్న వన్నె కుల క్షత్రియులు తమకంటూ ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలనేది చిర కాల కోరిక. వారికి పట్టణ సమీపంలో గుత్తార్లపల్లెలో గుడుపల్లె మండలం నక్కనపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 80లో 50 సెంట్ల భూమిని కేటాయించినా గత టీడీపీ ప్రభుత్వం దీనిని నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేసింది. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి గోడును గాలికొదిలేసింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్సీ భరత్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. గత నెల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. దీంతో నియోజకవర్గ వన్నె కుల క్షత్రియ కుల సంఘాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

వాల్మీకి భవనం పనులు ముమ్మరం

గుడుపల్లె మండలం నలగంపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 170-4, 171-3లో 1.04 ఎకరాలను ప్రభుత్వం మంజూరు చేసింది. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పనులను అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుత చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప స్పందించారు. భవన నిర్మాణానికి రూ.1.5కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఎంపీ నిధుల కింద రూ.30 లక్షలు మంజూరు చేయడంతో పనులు పూర్తి కావొస్తున్నాయి. వారం లోపు మిగిలిన పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని వాల్మీకి కులస్తులు చెప్పారు.

బలిజ భవనం కోసం..

కుప్పం మండలం వలార్లపల్లె రెవెన్యూ సర్వే నంబర్ 22లో 2 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి చేతుల మీదుగా శ్రీకృష్ణదేవరాయులు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీంతో పాటు ప్రాంగణ గోడ నిర్మాణం కోసం ఎంపీ రెడ్డెప్ప నిధుల కింద రూ.25 లక్షలను మంజూరు చేశారు. అలాగే జెడ్పీ నిధులతో తాగునీటి బోరు వేయిస్తామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, బలిజ భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని రెస్కో చైర్మన్ సెంథిల్ ప్రకటించారు. వీటన్నిటికీ ఎంపీ, జెడ్పీ చైర్మన్, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్, ఎమ్మెల్సీ భరత్ భూమి పూజ చేశారు.

గాండ్ల సామాజిక వర్గం కోసం..

నియోజకవర్గంలో ప్రాధాన్యత కలిగిన మరో సామాజిక వర్గం గాండ్ల కులస్తులు. వీరికి గత నెల గుడుపల్లె మండలం గుండ్లసాగరం రెవెన్యూకు చెందిన సర్వే నంబర్ 88లో 2 ఎకరాలను కేటాయించారు. కుప్పం పర్యటనలో గాండ్ల కులస్తులు వినతి మేరకు మంత్రి పెద్దిరెడ్డి స్థలం కేటాయించారు. ఇప్పటికే స్థలం చదును చేసి భవన నిర్మాణం కోసం ఉపక్రమించారు. అలాగే కృతజ్ఞతలు చెప్పేందుకు ఈ నెల 21న నియోజకవర్గ గాండ్ల కులస్తులు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు.

కాపు భవన్ నిర్మాణానికి స్థలం

నియోజకవర్గంలోని కాపు (వక్కలిగ) కులస్తులకు గతనెల స్థలం కేటాయించారు.గుత్తార్లపల్లె వద్ద సర్వే నంబర్ 80లో 40 సెంట్ల స్థలం కేటాయించారు. ఈ స్థలాన్ని త్వరలో కాపు కుల సంఘ నేతలకు అప్పగించనున్నట్టు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు.



వన్నెకుల క్షత్రియ భవనం



వాల్మీకి కులస్తులు భవనం



గాండ్ల కులస్తులకు కేటాయించిన స్థలం

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రెడ్డి వారిపల్లెకు చెందిన నవమోహన్‌రెడ్డికి రూ.2.10లక్షలు, లక్ష్మికి రూ.15వేలు, కల్లూరుకు చెందిన మల్లికార్జున నాయుడుకు రూ.లక్ష, నలీమ్‌కు రూ.20 వేలు, సోంపల్లి బాబు కొత్తపేటకు రూ.1.45లక్షలు అందజేశారు. జెడ్పీటీసీ మురళీధర్, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, సచివాలయ కన్వీనర్ ముర్వత్ బాషా, నాయకులు చెంచురెడ్డి, గోవిందరెడ్డి, మునీశ్వర, నటరాజ, ఆనందరెడ్డి పాల్గొన్నారు.



పులిచెర్లలో చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్లు

పుంగనూరు: విద్యాహక్కు చట్టం ప్రకారం 2023-2024 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు అడ్మిషన్లను ఉచితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కల్పిస్తున్నట్లు ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. తల్లిదండ్రులు తమకు నచ్చిన పాఠశాలల్లో అడ్మిషన్లు కోరే వారు సచివాలయాల ద్వారా తమ దరఖాస్తులను ఈనెల 23 నుంచి మార్చి 14లోపు వీటిని పంపాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులను నమోదు చేసుకోవాలని కోరారు.

కల్యాణం.. కమనీయం

బైరెడ్డిపల్లి: మండలంలో నెల్లిపట్లలోని వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం కల్యాణోత్సవం కమల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన కల్యాణవేదికపై శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు, వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అలంకరణలో కాళికాదేవి సమేత వీరభద్రస్వామి

హెచ్‌ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

రామకుప్పం: మండలంలోని ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన రాజుపేట రోడ్డులో సోమవారం హెచ్ఐవీ వ్యాధిపై ప్రజలకు కళాజాతతో అవగాహన కల్పించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ-జిల్లా ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు సోమవారం చిత్తూరు నాగరాజు కళాబృందం ఈ కార్యక్రమం నిర్వహించింది. హెచ్ఐవీ బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని చెప్పారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే సాధారణ జీవితం గడపవచ్చన్నారు. కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుమలత, సిబ్బంది హసీనా, అశ్వథమ్మ, షంషాద్, కళాకారులు నాగరాజు, మద్దెల మల్లికార్జున, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై విహారం

పలమనేరు: పట్టణంలోని శివాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామి వారు సింహవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. స్థానిక భేరి వైశ్య సంఘం ఉభయదారులుగా వ్యవహరించింది. మంగళవారం శేష వాహన సేవ నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ గంటి వీరభద్ర తెలిపారు. కార్యక్రమంలో ఈఓ కమలాకర్, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు-ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు

సదుం: మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి నడుమ వారధిగా విశేషమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. మరింతగా సేవలు చేసి, ప్రజల మన్ననలు పొందాలని కోరారు. సేవావజ్రగా ఒకరు, సేవారత్నలుగా ఐదుగురు, 176 మంది సేవామిత్రలుగా ఎంపికైన వలంటీర్లను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఇమ్రాన్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పులిచెర్ల: వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఉత్తమ వలంటీర్లుగా ఎంపికై ప్రభుత్వం నుంచి నగదు, ప్రశంసాపత్రాలు పొందిన వారిని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, వైస్ ఎంపీపీలు రాశి ప్రసాద్, ఈశ్వరి,ముర్వత్ బాషా, షుకూర్,రెడ్డి అహమ్మద్, ప్రతాప్‌రెడ్డి, ఆనంద, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, వలంటీర్ల పని తీరు వలన జిల్లాలో రొంపిచెర్ల మండలం పెన్షన్ల పంపిణీలో ముందంజలో ఉందని అభినందించారు. మండలంలో 167 మంది వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్పద్వారి, ఈఓఆర్‌డి రాజేంద్ర, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచులు ఇబ్రహింఖాన్, నాగిరెడ్డి, అన్వర్‌బాషా, జీవలత, ఎంపీటీసీ లక్ష్మి, సిరాజున్నీసా, కార్యదర్శులు పాల్గొన్నారు.





సదుం: వలంటీర్‌ను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు, రొంపిచెర్లలో..

నేడు శాంతిపురంలో..

శాంతిపురం: మండల స్థాయి గ్రామ వలంటీర్లకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ వసుంధర తెలిపారు. దండికుప్పం పంచాయతీలోని చౌడం పల్లె క్రాస్ వద్ద ఉన్న హార్టికల్చర్ హబ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని చెప్పారు. వలంటీర్ల సేవలు కీలకంగా మారాయన్నారు.

మెరుగైన వైద్యసేవలతో మన్ననలు



వైద్యులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- సీహెచ్‌సీ తనిఖీలో జెడ్పీ చైర్మన్

వి.కోట: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన స్థానిక సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ఓపీ రిజిస్టర్, ఆస్పత్రిలో రోగుల వార్డు, మందుల గదిని పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఇక్కడ వైద్య సదుపాయాలు ఎలా ఉంటున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రిని 100 ఆస్పత్రిగా మార్చడానికి తాము ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. త్వరలోనే ఆస్పత్రి సామర్థ్యం పెంచనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కిజియారాణి, కేశవులు, మురళి, సల్మా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్

సదుం: మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఎన్నికల నేపథ్యంలో త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ, మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో చేసిన అభివృద్ధిపై గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. పలు పంచాయతీలకు రేషన్ బియ్యం తక్కువగా మంజూరు చేస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని తహసీల్దార్ నారాయణస్వామి చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టరు గిరీష కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, మందుల కొరత ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రోగికి అవసరమైన వాటిని తెప్పించి ఇంటికి చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు పూర్తి

- కమిషనర్ నరసింహప్రసాద్



పుంగనూరు: జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల కార్యక్రమం దాదాపు పూర్తి కావొస్తున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో 1,394 మందికి పట్టాలు పంపిణీ చేశామని, ఇప్పటి వరకు 831 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసి ఇచినట్లు చెప్పారు. మిగిలిన 534 మందికి మూడు రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. అలాగే టిడ్కో గృహాలు 1,536 మందికి అన్ని వసతులు కల్పించి అందజేశామన్నారు. ఇప్పటి వరకు 1,300 మంది నివాసాలు ఏర్పరచుకున్నారని, మిగిలిన వారు మార్చాల్సి ఉందన్నారు.

230 మందికి 'వైఎస్సార్ నేస్తం'

మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ నేస్తం పథకం కింద 230 మందిని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల ఈబీసీ పథకం కింద గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపామని కమిషనర్ చెప్పారు. త్వరలోనే వైఎస్సార్ నేస్తం నిధులు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

మున్సిపాలిటీలోని 31 వార్డులలో పని చేస్తున్న 202 మంది వలంటీర్లకు మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల: బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రొంపిచెర్ల ఎస్‌బీఐ మేనేజర్ భాస్కర్ కోరారు. ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా సోమవారం మండలంలోని పెద్దమల్లెలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడారు. బ్యాంక్ సేవలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన సామాజిక భద్రత, ప్రమాద బీమాపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఉద్యోగులు గిరీష్, సీవీ రావు, కళాజాత బృందం రాఘవేంద్ర, మహేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



పెద్దమల్లెల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

పలమనేరు: పట్టణంలోని డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో సంస్థ చైర్‌పర్సన్ సైనారు మధుబాల పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, కుట్టి డీఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పవన కుమారి సాయంతో పట్టణానికి చెందిన వందమంది అభ్యర్థులకు రూ.3లక్షల విలువజేసే స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్టు చెప్పారు. వీటిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక లైబ్రేరియన్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

చౌడేపల్లి: స్థానిక సంతగేటు సమీపంలోని చింత తోపులో ఓంశక్తి అమ్మవారి ఆలయ నిర్మాణానికి సోమవారం ఉదయం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. భక్తిశ్రద్ధలతో ఓంశక్తి అమ్మవారి చిత్రపటానికి మహిళలు పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు తోడ్పాటునివ్వాలని కోరారు.

పనిభారం తగ్గించరూ!

పలమనేరు: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న తమకు పనిభారం తగ్గించాలని కోరుతూ సోమవారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు జయశంకర్‌కు ఆరోగ్య కార్యకర్తల నాయకురాళ్లు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఏఎన్‌ఎం యాప్‌లో ఎక్కువ పనిభారం ఉండటం తమకు ఇబ్బందిగా ఉందన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో తాము కష్టపడి ఎంట్రీ చేస్తుంటే లబ్ధిని వేరే వాళ్లు పొందడం సమంజసం కాదన్నారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు అముద, అనీల, హారతి, సుభాషిణి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

సదుం: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీష సోమవారం వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వార్డెన్ షరీఫ్, హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ, సీహెచ్ఓ శ్రావణి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గిరీష